BHARATH SAMACHAR DIGITAL

9, అక్టోబర్ 2025, గురువారం భారత్ సమాచార్

జగన్ పర్యటనపై డీజీపీ హరీష్ కుమార్ గుప్తా హెచ్చరికలు



భారత్ సమాచార్, ఆంధ్రప్రదేశ్: పోలీసులు నిర్దేశించిన మార్గంలో కాకుండా వేరే మార్గంలో వెళ్తే, వాహన శ్రేణిని దారిలో ఎక్కువ సార్లు ఆపడం, భారీ జన సమీకరణ వంటివి చేస్తే మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నర్సీపట్నం పర్యటనకు ఇచ్చిన అనుమతి దానంతట అదే రద్దు అవుతుందని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా హెచ్చరించారు. నిబంధనల్ని ఉల్లంఘిస్తే రాజకీయ హోదా, పార్టీతో ఎలాంటి సంబంధం లేకుండా క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో పోలీసులు జీరో టాలరెన్స్ విధానాన్ని అనుసరిస్తారని వెల్లడించారు. జగన్ నర్సీపట్నం పర్యటనకు పోలీస్ చట్టం సెక్షన్ 30, 30ఏ ప్రకారం నిర్దేశించిన మార్గం, సమయం, ప్రయాణ పరిమితికి అనుగుణంగానే అనుమతి ఇచ్చినట్లు ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జగన్ ప్రయాణించే మార్గంలో ముందు, వెనక ఊరేగింపులు, ర్యాలీలు, ప్రదర్శనలు, భారీ జన సమీకరణ చేయడం నిషేధించామని పేర్కొన్నారు. అనుమతించిన ప్రాంతంలో కాకుండా ఇతర చోట్ల రాజకీయ నినాదాలు, స్వాగతాలు లేదా సభలు నిర్వహించరాదని తెలిపారు. కార్యకర్తలను, జనాన్ని సమీకరించడం, ట్రాఫిక్ నిరోధించడానికి ప్రయత్నించడం వంటివి చట్ట ఉల్లంఘనలుగా పరిగణిస్తామని వెల్లడించారు. అనుమతి లేని వాహనాలను స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. ప్రజల రక్షణ కోసమే పోలీసు ఏర్పాట్లు అని ఆయన అన్నారు. ఏదైనా ప్రమాదం లేదా ఆస్తి నష్టం జరిగితే నిర్వాహకులే బాధ్యత వహించాలని దానికి వారు లిఖిత పూర్వక హామీ ఇవ్వాలని వెల్లడించారు.

18 షరతులు – 10 వాహనాలు: ఇప్పటికే జగన్ గురువారం నర్సీపట్నం పర్యటనకు విశాఖ, అనకాపల్లి పోలీసులు 18 నిబంధనలతో అనుమతి ఇచ్చారు. ఆయన కాన్వాయ్‌లో 10 వాహనాలకు మాత్రమే అనుమతి ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు, ట్రాఫిక్‌కు సమస్యలు తలెత్తకుండా పోలీసులు రూట్ మ్యాప్‌ను ఇచ్చారు. ఆ రూట్‌లోనే వెళ్లాలి తప్ప ఇతర మార్గాల్లో వెళ్లకూడదని విశాఖ సిటీ పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హాలు పేర్కొన్నారు. ఏదైనా ప్రాణ నష్టం లేదా ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగితే నిర్వాహకులదే వ్యక్తిగత బాధ్యత వహించాలని తెలిపారు.

హెలికాప్టర్‌లో వచ్చేందుకు అనుమతి: అనకాపల్లి జిల్లా మాకవరపాలెం పర్యటనకు నేడు మాజీ సీఎం జగన్ రానున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ తుహిన్ కుమార్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. విశాఖ నుంచి మాకవరపాలెం వరకు హెలికాప్టర్లో వచ్చేందుకు ఆయనకు అనుమతి ఇస్తున్నమన్నారు.

విశాఖపట్నం ఎయిర్పోర్టు నుంచి మాకవరపాలెం వరకు 63 కిలోమీటర్లు మేర రోడ్డు మార్గం ద్వారా జగన్ వచ్చేందుకు వైఎస్సార్సీపీ నేతలు దరఖాస్తు చేశారు. నేషనల్ హైవేపై ముఖ్య కూడళ్ల వద్ద జన సమీకరణ చేపట్టి ప్రదర్శన చేస్తారన్న సమాచారం ఉంది. దీని వల్ల ట్రాఫిక్‌కి అంతరాయంతో పాటు ప్రజలకు ఇబ్బంది కలుగుతుంది.

ఇటీవల తమిళనాడులోని కరూర్‌లో తొక్కిసలాట జరిగి 41 మంది మృతి చెందారు. అలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా విశాఖపట్నం నుంచి మాకవరపాలేనికి హెలికాప్టర్‌లో వచ్చేలా జగన్ చొరవ చూపాలి అని ఎస్పీ తెలిపారు.

© 2025 Bharath Samachar